మాతాపుత్ర విరోధాయ హిరణ్యాయ నమోనమః

'ధనమూల మిదం జగత్తనీ డబ్బును పొగడేవారున్నారు. కాని ఆ డబ్బు ప్రాణాల్ని నిలుపలేదు. అట్లా నిలుపగలిగితే డబ్బున్న వాళ్లకు చావే వుండదు. ఆరోగ్యమే మహా భాగ్యమని పెద్దలంటారు. ఆకలి చావులున్న మాట వాస్తవమేకాని కరకరా ఆకలి వేసేవారి ఆరోగ్యం ఉన్నట్లుగా అజీర్తివాడి కుండదు గదా!

గాలి వుంటేనే దీపం వెలుగుతుంది. అదే గాలి ఎక్కువైతే దీపం కొండెక్కుతుంది. అట్లాగే మానవుడు బ్రతకటానికి డబ్బు కావాల్సిన మాట నిజమే ఐనా ఆ డబ్బే ఎక్కువైందా, కష్టాలు మొదలౌతాయ్.

పాపాయపాలెంలో వరదయ్యనే సామాన్య రైతున్నాడు. తల్లి అన్నం పట్టుకొచ్చేవేళకు వరదయ్య దున్నటం ఆపి ఏదో కుండను బరువుగా ఎత్తిపైకి తీశాడు. కాని తల్లిని చూసి దాన్ని మళ్లీ భూమిలోపల పూడ్చిపెట్టాడు.

తల్లికుండ విషయం కొడుకుతో ప్రస్తావించలేదు. "నాయనా ఇంత కష్టపడుతున్నావ్. ఇంత కూడు కడుపునిండా పెట్టుకోలేక పోతున్నానురా! ఒక్క క్షణంలో దోసకాయ పప్పు వండి తీసుకొని వస్తా గదా!" అంటూ ఇంటికి చరచరా వెళ్లి పోయింది.

వరదయ్యకు దోసకాయ పప్పంటే ఎంతో ఇష్టం. తల్లి ఎప్పుడు తెస్తుందా అని ఎదురుచూస్తున్నాడు. తల్లి అల్లంత దూరాన వుండగా తాను తల్లికోసం ఎదురు చూసినప్పుడు పరాయివాడెవడైనా బంగారు నాణాల కుండను ఖాళీచేశాడేమో అని మళ్లీ చూసుకొన్నాడు.

ఇంతలో తల్లి రానే వచ్చింది. వస్తూనే "నాయనా ముందు బువ్వ తినరా" అంది. కాని వరదయ్య ఆలోచన వేరు. తాను అన్నం తింటే మనసు మారిపోతుందేమో? ఆవిడ చేయి అట్లాంటిది— అమృతహస్తం. "ఇప్పుడే వస్తా నుండమ్మా" అని నాగలి తీసుకొచ్చి పొరపాటున చెయి జారి పోతున్నట్టు "అమ్మా! అమ్మా! తప్పకో!" అని కేకేశాడు.

అప్పటికే నాగలి కొస తలకు తగిలిందేమో ఆ తల్లి "నాయనా బువ్వ..." అంటూ నేల వాలింది. 'అయ్యో! చచ్చిపోతూ కూడా నా బువ్వమాటే చెప్పిందిగదా!' అనుకొన్నాడు వరదయ్య. తాను బంగారు నాణాల కుండను తవ్వి తీస్తుంటే తల్లి చూసిందేమో అని అతని అనుమానం. అనుమానం పెనుభూతమన్నారు. అందుకే తల్లి అవైనా చూడకుండా తాను నాగలి కొర్రుతో ఆమె తలను చితక కొట్టాడు.

కాళ్లు చేతులు కదుక్కుని బువ్వక్కూచున్నాడు. 'పిచ్చి ముండ! చచ్చిపోయింది' అనుకొంటూతన కెంతో ఇష్టమైన దోసకాయ పప్పు అన్నం కలిపాడు. కలుపుతూ ఆలోచనలో పడ్డాడు. ' ఆ బంగారంతో తన భార్యకు నగలు చేయించాలి. కొంత అమ్మి ఈ భూమికి కలిసే పక్క పొలాలు కొనాలి. ఊళ్లో ఎవరికీ లేనంత పెద్ద భవంతి కట్టాలి. అందులో తానూ, భార్య సుఖపడవచ్చు. ఛ!ఛ! తన భార్యకు వంటరాదే. పోనీ వంట మనిషిని పెట్టుకొందాంలే. ఐనా బాగా వంట చేసేది-తల్లిని బతకనిస్తే బాగుండేది' అనుకొంటూ ఆ దోసకాయ పప్పు ముద్ద తిన్నాడు. తిన్నాడో లేదో నాలుక పీక్కుపోసాగింది. 'అన్నంలో విషం కలిసిందన్న మాట! తనకు విషం ఎవరు పెడతారబ్బా!' అనుకొంటుంటే బంగారు నాణాల కుండను తల్లి చూసి వుంటుందన్న సందేహం నిశ్చయమైపోయింది. 'అమ్మ ముండా! చంపావు గదే!' అంటూ విరుచుకు పడ్డాడు వరదయ్య.

ఈ జరిగిందంతా చూచిన ఓ కవి సంస్కృతంలో

'హాలాగ్రేన హతామాతా
విషాన్నేన మృతస్సుతః
మాతాపుత్ర విరోధాయ
హిరణ్యాయ నమోనమః

—చిట్టా దామోదరశాస్త్రి

నిహిలించిన మీ ఆనందం
ప్రతీక దేనికన్నది నిర్లయం నిరర్థకం
పశుత్వం మానవ మేధకనాది పారం పర్యం
అది మరిస్తే ద్విపాది మానవుడవుతాడన్నది కాదు
దూరం సత్యానికి
ఉపన్యాసాలు ప్రవచనాలు కాదు నా కర్తవ్యం
నా జీవితమేనా నన్ను బతక నియ్యండన్నది ఘటించిన
నా అంజలి భావావేశం
అందుకే
అది లోపించినందుకే
విరిగించండి మీ కలాల్ని మా కాగితాల మీద
నా మరణాన్ని నేను ఆదరిస్తున్నా అపహసించకండి
వాంగ్మూలాన్ని
మరుగు
అలల తలల మీద కలికితురాయి
మరణం
నేను పూసే చిట్ట చివరి ఆనంద కదంబం
అదే మీ సామర్థ్యాని కపహాస్యం
ప్రదర్శించండి బేసిగ్గుగా
ప్రకటించండి నిర్లజ్జగా
ఎక్కడో
ఏ నిర్జనారణ్య పాదపం పాదాల మీదో పరిమారి
పోదామన్న తపన
దుర్జనారణ్య నిర్దాక్షిణ్య పదఘట్టనల కింద బలిహారం
అంగబలం చేసే తప్పుల వల్మీకంలో బుసలు కొట్టే
కాలనాగులకి
ఎప్పుడూ
కొందరే అతి కొద్ది కొందరే బలి పశువులు
అందుకే
సమాజం పునాదులెప్పుడూ రక్తసిక్తం
ఘనీభవించిన అదృశ్య రక్తాన్ని ప్రక్షాళితం చేస్తూనే
వుంటాయి నా చేతులెప్పుడూ
అచ్చంగా అందుకే
నా మరణం నా కానందం
ఆ వేళ్ళని కణుపుల్లో బద్దలించడం
ఆ చేతుల్ని గూళ్ళలో విరిచెయ్యడం
పరమా వధి మా ఆశయాలకి
కళ్ళు లేవు కూపస్థాలకి
పళ్ళు లేవు చరిత్రని కాటేస్తున్న వక్రముఖాలకి
చూపుల్లేవు రంగు లద్దుకున్న నేత్రాలసులోచనాలకి
అనుభూతుల్లేనే లేవు రాతల్లో అనే బూతులే తప్ప
పైత్యం వికటించిన శిరోమధ్యంలో పేరుకున్న మేధ్యం
చొంగలా పూసుకున్న సాంత కంపు సెంటు,
చెమటలో కొడుతోంది దుర్గంధం
పాయిజీకి గూండాయిజీకి తెలియని తేడాల మౌఢ్యం
ఆకలి ఆవేశానికి ఛందోభాష్యం
అన్నార్తుని కేకలో వ్యాకరణ సూత్రం వెతికే మీ
సాహితీ విభవ ద్విగుణితోన్మాదం
కాదు కాదు సహ్యోతిసహ్యం
అందుకే
అన్నన్నా అందుకే
నా మీద నేనే తాండవం
మీకు చేతకానిది నా సంహారం
అందుకే
అచ్చంగా అందుకే
ధిక్కరిస్తున్నాను మృత్యువునే
నేనే చెక్కుతున్నాను నా మరణాన్ని
విరగ్గొట్టండి మీ కలాల్ని మీరే
చించేసుకోండి మీ మెదళ్ళ పొరల్లో కాగితాల్ని
మీరే పలవరించండి మీ బుక్కుల్లో వక్ర భాష్యాల
రుక్కుల్ని
వెడుతున్నాను మృత్యువు మీద అడుగు లేసుకుంటూ
వెడుతున్నాను నా మరణాన్ని నేనే కప్పుకుంటూ.